## త్వరలో పటాన్‌చెరులో గద్దర్ విగ్రహావిష్కరణ



పటాన్‌చెరు, అక్టోబర్ 3: పటాన్‌చెరు పట్టణంలో కవి, గాయకుడు, తెలంగాణ ఉద్యమకారుడు గద్దర్ విగ్రహావిష్కరణకు ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. త్వరలోనే గద్దర్ విగ్రహాన్ని ఆవిష్కరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. పటాన్‌చెరు పట్టణంలోని బస్టాండ్ ఎదురుగా 11అడుగుల కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి నిర్ణయించారు. గద్దర్ మృతి చెందిన సమయంలో నివాళిగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి బస్టాండ్ ముందు గద్దర్ విగ్రహ ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. ఇప్పుడు గద్దర్ కాంస్య విగ్రహం పూర్తయింది. 6ఫీట్ల గద్దెపై గద్దర్ విగ్రహం ప్రతిష్టిస్తారు. మంత్రి తన్నీరు హరీశ్‌రావు విగ్రహా న్ని ఆవిష్కరించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

## ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా జనార్దన్‌రెడ్డి

రామచంద్రాపురం/జిన్నారం, అక్టోబర్ 3 : ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా జనార్దన్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మంగళవారం ఆర్సీపురంలో తెలంగాణ రాష్ట్ర ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ కన్వీనర్ రాఘవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా కార్యవర్గాన్ని నియమించారు. ఆర్సీపురం డివిజన్‌కు చెందిన జనార్దన్‌రెడ్డిని అధ్యక్షుడిగా నియమించడంతో పాటు కార్యదర్శిగా శ్రీనివాస్‌రెడ్డి, కోశాధికారిగా సతీశ్‌షెట్కార్, కార్యనిర్వహణ అధ్యక్షులుగా గోవర్ధన్‌రెడ్డి, కరుణసాగర్‌రెడ్డి, గౌరవ అధ్యక్షుడిగా దశరథ్‌రెడ్డిలను నియమించారు. ఈ సందర్భంగా రాఘవేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రైవేట్ స్కూల్స్ యాజమానులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్ని స్కూల్స్ మేనేజ్‌మెంట్‌లను ఒకతాటిపైకి తీసుకొస్తామన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గాల ప్రైవేట్ స్కూల్ యజమానులు, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



జిల్లా అధ్యక్షుడిగా ఎంపికైన జనార్దన్‌రెడ్డిని సన్మానిస్తున్న రాష్ట్ర కన్వీనర్ రాఘవేందర్‌రెడ్డి

## ఆసానికుంటలో రసాయన వ్యర్థాల పారవేత

బొల్లారం, అక్టోబర్ 3 : మున్సిపల్‌లోని ఆసానికుంట ప్రధాన కాలువలో గుర్తు తెలియని వ్యక్తులు పెద్ద ఎత్తున రసాయన ఘన వ్యర్థాల బ్యాగులను పారవేయడం స్థానికంగా కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే.. సోమవారం రాత్రి 8గంటల సమయంలో టాటా ఏస్ వాహనంలో స్లాడ్జ్‌తో నింపిన దాదాపు 40బ్యాగులను యథేచ్ఛగా పారవేసి వెళ్లినట్లుగా స్థానికులు చెబుతున్నారు. ఈ ఘటనపై స్థానికులు పిసిబి అధికారులకు ఫిర్యాదు చేయగా వెంటనే పిసిబి ఈఈ దుర్గేశ్ ఆసానికుంట ప్రాంతంలో పారవేసిన సంచుల నుంచి వ్యర్థాల శాంపిల్స్ సేకరించారు. వాటి రిపోర్టుల ఆధారంగా ఏ పరిశ్రమకు చెందినవో నిర్ధారణ చేసి తగు విధంగా చర్యలు తీసుకుంటామని అధికారి తెలిపారు.



కుప్పలుగా పారవేసిన స్లాడ్జ్ సంచులు

## నేడు మండల సర్వసభ్య సమావేశం

గుమ్మడిదల, అక్టోబర్ 3: మండలంలోని సర్వసభ్య సమావేశాన్ని బుధవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో చంద్రశేఖర్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మండల సర్వసభ్య సమావేశానికి మండలంలోని అన్నిశాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కోఆప్షన్ సభ్యులు తప్పక హాజరుకావాలని సూచించారు. ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు.

# బీఆర్‌ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకులు

గుమ్మడిదల, అక్టోబర్ 3 : మండలంలోని అనంతారం గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి సమక్షంలో మంగళవారం బీఆర్‌ఎస్‌లో చేరారు. బీఆర్‌ఎస్‌లో చేరిన వారిలో చింతల రమణారెడ్డి,పెరుగు నాగరాజు, పెరుగు శేఖర్, రామగల్ల ఎల్లం, జోగు వీరయ్య, కృష్ణయ్య, రాములు, యాదయ్య, పోచయ్య, భాస్కర్ ఉన్నారు. వీరికి ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి బీఆర్‌ఎస్ కండువాలు వేసి పార్టీలోకి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం కేసీఆర్ పాలనలో జరుగుతున్న అభివృద్ధిని చూసి వివిధ పార్టీల నాయకులు, యువకులు, మహిళలు స్వచ్ఛందంగా బీఆర్‌ఎస్ చేరుతున్నారన్నారు. పార్టీలో చేరుతున్న వారందరికీ సముచిత గౌరవం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సద్దిప్రవీణభాస్కర్‌రెడ్డి, జడ్పీటీసీ కుమార్‌గౌడ్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు హుస్సేన్, సర్పంచ్ దీపానరేందర్‌రెడ్డి, ఉపసర్పంచ్ స్వరూపాలక్ష్మణ్, వార్డు సభ్యులు తలారి యాదయ్య, అరుణ, యశోద, భిక్షపతి, కో-ఆప్షన్ సభ్యుడు మహేశ్‌యాదవ్, నాయకులు యాదిరెడ్డి, సాయిరెడ్డి, చంటి, శ్రీకాంత్ పాల్గొన్నారు.



ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరుతున్న కాంగ్రెస్ నాయకులు

# చెరువులు, కుంటల పరిరక్షణకు చర్యలు తీసుకుంటాం

- మున్సిపల్ చైర్‌పర్సన్ రోజాబాల్‌రెడ్డి
- వాడివేడిగా బొల్లారం మున్సిపల్ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రోజాబాల్‌రెడ్డి

బొల్లారం, అక్టోబర్ 3 : నిబంధనలకు విరుద్ధంగా శిఖం భూములు, కుంటలను ఆక్రమించి అక్రమ నిర్మాణాలను చేపడితే కఠిన చర్యలు తప్పవని బొల్లారం మున్సిపల్ చైర్‌పర్సన్ కొలన్ రోజాబాల్‌రెడ్డి హెచ్చరించారు. మంగళవారం బొల్లారం మున్సిపల్ సర్వసభ్య సమావేశాన్ని ఉదయం 11 గంటలకు తాత్కాలిక కార్యాలయంలో చైర్‌పర్సన్ రోజాబాల్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సభ ప్రారంభం కాగానే రూ.30లక్షల పనులకు సంబంధించి కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలిపారు. మున్సిపల్‌లోని ఇంజినీరింగ్ విభాగం పనులతో పాటు మౌలిక వసతులు, స్వచ్ఛతాహీ సేవా, గణేశ్ నిమజ్జన నిర్వహణకు సంబంధించిన ఖర్చులకు రూ. 30లక్షలు ఏకగ్రీవంగా ఆమోదించారు. అనంతరం జరిగిన సభలో పలువురు సభ్యులు శిఖం భూములు, కుంటల్లో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని సభలో చర్చించారు. చెరువులు, కుంటలు కబ్జాకు గురైన వాటిపై విచారణ జరిపి తగు విధంగా చర్యలు తీసుకోవాలని సభ్యులు సభలో డిమాండ్ చేశారు.

బతుకమ్మ ఘాట్‌ల నిర్మాణంపై సభ్యులు సభలో ప్రశ్నించారు. రెన్లకుంటలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై కౌన్సిలర్ చంద్రారెడ్డి సభలో ఆగ్రహం వ్యక్తం చేశారు. కబ్జాకు గురవుతున్న కుంటలను కాపాడాలని కోరారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ రోజాబాల్‌రెడ్డి మాట్లాడుతూ చెరువులు, కుంట లు కబ్జాకు గురికాకుండా పరిరక్షణ చేపట్టాలని అధికారులను కోరారు. ఇరిగేషన్ శాఖ అధికారులతో కబ్జాకు గురైన చెరువులు, కుంటల విస్తీర్ణంపై విచారణ చేయించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. నిబంధనలకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి, వైస్ చైర్మన్ అనిల్‌కుమార్ రెడ్డి, ఆర్వో శ్రీధర్, మేనేజర్లు నిర్మల, మల్లికార్జున్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, ఆయా శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌కు ఓటేస్తే మొండిచెయ్యే



మాట్లాడుతున్న టీఎస్ హెచ్‌డీసీ చైర్మన్ చింతా ప్రభాకర్

సదాశివపేట, అక్టోబర్ 3 : 65 ఏండ్ల కాంగ్రెస్ హయాంలో ప్రజలకు ఒరిగిపెట్టిందేమిలేదని, కాంగ్రెస్‌కు ఓటేస్తే మొండిచెయ్యే చూపిస్తారని రాష్ట్ర చేనేత అభివృద్ధి సంస్థ చైర్మన్ చింతాప్రభాకర్ అన్నారు. మంగళవా రం పట్టణంలోని 4వ వార్డులో కౌన్సిలర్ నస్రీన్ నజీర్ ఆధ్వర్యంలో ము ఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టీఎస్‌హెచ్‌డీసీ చైర్మన్ చింతా ప్రభాకర్ మాట్లాడుతూ కాంగ్రెస్ చెప్పే ఆరు గ్యారెంటీలను నమ్మి మోసపోవొద్దని సూచించారు. దేశంలోని రాష్ట్రాలన్నీ తెలంగాణ అభివృద్ధిని మెచ్చుకుంటున్నాయన్నారు. దేశంలోని 29రాష్ట్రాల్లో కరెంటు సరిగా లేదని, వ్యవసాయానికి కూడా సాగునీరు అందడంలేదన్నారు. తెలంగాణలో అమలు చేస్తున్న పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. సీఎం కేసీఆర్ కృషి వల్లనే తెలంగాణ అభివృద్ధిలో ముందు వరుసలో ఉన్నదన్నారు. రాబోయే ఎన్నికల్లో ముఖ్యమంత్రి కేసీఆర్‌ను హ్యా ట్రిక్ సీఎంగా చేయాలని, అనునిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే తనను ఆశీర్వదించాలని కోరారు. ఈ సారి బీఆర్‌ఎస్ అభ్యర్థి చింతా ప్రభాకర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామని వార్డు సభ్యులు తీర్మానం చేశారు. అనంతరం పంచముఖీ హనుమాన్ మందిరంలో చింతాప్రభాకర్ ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ప్రకాశ్ చౌదరి, కో-ఆప్షన్ సభ్యుడు ఖలీంపటేల్, బీఆర్‌ఎస్ నాయకుడు సమి, డప్పు నర్సింహులు, కామెల్, చంద్రసేన్, మల్లేశం, రియాజ్ పాల్గొన్నారు.

## పాడి రైతుకు ఎంపీపీ ఆర్థిక సాయం



పాడిరైతుకు ఆర్థికసాయం అందజేస్తున్న ఎంపీపీ

జిన్నారం, అక్టోబర్ 3: మండలంలోని పెద్దమ్మగూడెం గ్రామానికి చెందిన గుర్రాల నరేశ్, గుర్రాల యా దయ్యకు చెందిన బర్రెలు మృతి చెందాయి. వర్రెలు మృతితో సుమారు రూ. లక్షన్నర నష్టపోయారు. విషయం తెలుసుకున్న ఎంపీపీ రవీందర్‌గౌడ్ మంగళవారం బాధిత కుటుంబాలను ఆయన పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. పశువులన్నింటికి పాడిరైతులు బీమా చేయించాలని సూచించారు. ఇలాంటి అనుకొని ఆపదల నుంచి బీమా పాడిరైతులను కాపాడుతుందన్నారు. కార్యక్రమంలో యాదయ్య, సాయికుమార్, వెంకటేశ్, అశో క్, శివ, అనంతగిరి, నరేశ్, దిలీప్, వినయ్, సాయి పాల్గొన్నారు.

## బీఆర్‌ఎస్‌తోనే గ్రామాల అభివృద్ధి

**చేనేత అభివృద్ధి సంస్థ చైర్మన్ చింతాప్రభాకర్**

కంది, అక్టోబర్ 3 : బీఆర్‌ఎస్ ప్రభుత్వంతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని చేనేత అభివృద్ధి సంస్థ చైర్మన్ చింతాప్రభాకర్ అన్నారు. మంగళవారం మండలంలోని ఇంద్రకరణ్‌లో రూ. 2.30 కోట్లతో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా చింతా ప్రభాకర్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నారన్నారు. గత ప్రభుత్వాలు పల్లెలను పట్టించుకోలేవని, తెలంగాణ ప్రభుత్వంలో గ్రామాలు అభివృద్ధి పథంలో పయనిస్తున్నాయన్నారు. పల్లెప్రగతి, హరితహారంతో గ్రామాలు కొత్తశోభను సంతరించుకున్నాయన్నారు. రాబోయే ఎన్నికల్లో ముఖ్యమంత్రి కేసీఆర్‌ను హ్యాట్రిక్ సీఎంగా ఆశీర్వదించాలని, నిత్యం ప్రజల్లో ఉంటున్న తనను ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ సరళ పుల్లారెడ్డి, జడ్పీటీసీ కొండల్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ నరహరిరెడ్డి, ఇంద్రకరణ్ సర్పంచ్ వేణువర్ధన్‌రెడ్డి, ఎంపీటీసీ చంద్రి శ్రీను, బీఆర్‌ఎస్ నాయకులు నారాయణయాదవ్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న టీఎస్‌హెచ్‌డీసీ చైర్మన్ చింతా ప్రభాకర్